దండ్రులు ఆమోదించ లేదట. ఆ శ్వేతజాతి యువకుడు మరో శ్వేతజాతి యువతిని ప్రేమించి, సలక్షణంగా వివాహం చేసుకున్నాడు. సత్యవాణికి గుండెలు బద్దలయ్యాయి. మనసు వికలం అయింది. అప్పటినుండీ సత్యవాణి మత్తుమందుల అలవాటులో పడిపోయింది. ఒకనాడు సత్యవాణి ఒక హోటల్‌లో పదవ అంతస్తు నుండి దూకి ఆత్మహత్య చేసుకుంది.

ఇక ప్రసూన జీవితంకూడా దాదాపు అలాగే ముగిసింది. ప్రసూన కాలేజీలో చదువుతుంటే, వెస్టిండీస్ నుండి ఇక్కడకు వచ్చిన ఒక నీగ్రో యువకుడు ప్రసూనను ప్రేమించాడట. కానీ, ప్రసూన చూపులు శ్వేతజాతి యువకుని మీదనే ఉన్నాయి. నీగ్రో తనను ప్రేమించడం అవమానంగా భావించింది అదే భావాన్ని ఆ నీగ్రో కుర్రవానికి పరుషంగా తెలిపిందట. తెల్లవాళ్ళ చేత అసహ్యించుకోవడం నీగ్రోలకు అలవాటు అయిపోయింది. కానీ తమకంటే ఏమాత్రం తీసిపోని భారతీయులు కూడా తమను అసహ్యించుకోవడం ఆ నీగ్రో యువకునికి కష్టం వేసిందట. వేసిందట! దానితో అతడు ఇద్దరు ముగ్గుర్ని పోగుచేసి ప్రసూనను ఒక కార్లో బలవంతంగా ఎక్కించుకుని దూరంగా ఉన్న ఒక బీచ్‌లో ప్రసూనను మానభంగం చేశాడు... చేయించాడు. ఆ తరువాత ప్రసూనను అక్కడే చంపి వేశాడు.

నా కళ్ళకు కప్పిన మిథ్యా నాగరికత తెరలు తెగి పడ్డాయి. నేను పెంచుకున్న అంతర్జాతీయత, సమభ్రాతృత్వం నన్ను ఎగతాళి చేశాయి. దానికి తోడు లక్ష్మికి క్యాన్సర్ అని ధ్రువపడింది. లక్ష్మిని క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించి, సరస్వతి భవిష్యత్తును తీర్చిదిద్దాలని నిశ్చయించుకున్నాను.

కానీ, ఇప్పటికే సరస్వతికి పద్దెనిమిదేళ్ళు దాటాయి! ఇక్కడి ఆడపిల్లలు తమకు పద్దెనిమిది ఏండ్లు ఎప్పుడు నిండుతాయా అని వెయ్యి కండ్లతో ఎదురు చూస్తుంటారు. పద్దెనిమిదేళ్ళ వరకూ కన్నెపిల్లగా ఉంటే అవమానమట! సరస్వతిని ఇంటి పట్టున ఉంచి, ఒక భారతీయుణ్ణిచ్చి పెండ్లి చేద్దామనుకున్నాను. సరస్వతి స్వాతంత్ర్యాన్ని అరికట్టాను. సరస్వతి నన్ను లెక్కచేయకుండా తన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించి ఉండేది! కానీ నా ఆస్తికి ఏకైక వారసురాలు కావడంతో భయపడి, నేను చెప్పినట్లు విన్నట్లు నటించేది. సరస్వతికి భారతీయ విలువలను, సంస్కృతిని నేర్పాలని ప్రయత్నించి ఓడిపోయాను. ఈ ఆస్తి ద్వారా మట్టుకే సరస్వతిని లొంగదీయ దలచుకున్నాను.

అందుకే వీలునామాను వ్రాశాను. నేను ఇక్కడికి వచ్చాక కోటి రూపాయల ధనం, ఒక చక్కని బంగళా, అత్యంత ఆధునికమైన డిస్పెన్సరీని సంపాదించాను. కోటి రూపాయలను పౌండ్లలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాను. ఇంటినీ, డిస్పెన్సరీని నా మరణానంతరం ఇక్కడి సేవా సంస్థలకు చెందాలని వీలునామాలో ఉటంకించాను. కోటి రూపాయల నిధికి మిమ్మల్ను సరస్వతికి హిందూ సాంప్రదాయకంగా కాబోయే భర్తను ట్రస్టీలుగా నియమించాను. ఆ నిధిపైన సంవత్స




# సొతొంత్రం

“ఒరే! అయ్యా! రేపు సొసంత్ర దినవంట గదా.” పదేళ్ళ కోటిగాడు నిక్కరు ఎగదోసుకుంటూ అడిగాడు. అదో కాబరే డాన్సర్ డ్రెస్‌లా ఉంది.

“ఎదవ సొసంత్రం వేటి, సొసంత్రం? సొతొంత్ర రేపే!” కల్లుసీసా కిందబెట్టి కుసురుకుంటూ చెప్పాడు ఎల్లిగాడు.

కోటిగాడు అయ్యపక్కన చేరాడు. “సొతంత్రం అంటే ఏటయ్యా?”

ఎల్లిగాడు అదేం పట్టించుకోకుండా కుక్కి మంచంలో కూలబడ్డాడు. అందాకా దానికింద ముసుగు దన్నిన గజ్జికుక్క ‘కుయ్యో’ మని యివతలపడింది. ఎల్లిగాడుమాత్రం ఆకులోంచి మసాలాతాలికు కూర ముక్కేదో తీసి చప్పరించసాగాడు. వాడిదదో ఆనంద లోకం.

కోటిగాడికి కోపం ముంచుకొచ్చింది అయ్యతీరుకి. ఒక్క కుదుపు కుదిపాడు — “సొతంత్రవంటే ఏటయ్యా?” అంటూ.

ఎల్లిగాడు తుప్పుక్కున ఉమ్మేశాడు—“ఎంట్ర నీ గోల!” అంటూ.

“సొతంత్రవంటే ...”గునిశాడు కోడిగాడు.

“నీ యవ్వ! ఒల్లకోవుగద! సొతొంత్రవంటే ...” అని మరో గుక్క కల్లు పట్టి—“మా సిన్నప్పట్నాంగ తన్నావాట. దేశంలో తెల్లోల్లుండేవోల్లు. అబ్బ! ఆల్లున్నప్పుడు శానా బాండేదిలే. మన గాంది తాత నేడూ ... ఆయనొచ్చి ఆల్లెల్లి పోవాల్ని ప్రైకులు సేయించ్చాడు.”

“సేయిత్తే.”

“ఆల్లెల్లిపోనారు. అదే సొతొంత్రం!”

“ఒసింతేనా!” అని ఒక్కక్షణం ఆగి—“అయితే, అయ్యా! ఆల్లెందు కెల్లిపోనా లసలు?” అన్నాడు.

“అదంతే. ఆల్లెల్లి పోవాల్స. నే పోతే సొతొంత్రం లేదు.”

“మరి సొతొంత్ర వంటే ...”

“ఒరే! దొంగనాకొడక! యిప్పుడే గదర సెప్పిన్ను. మళ్లి సొతొంత్ర వంటే ...అంటవు. నే, నే! పనికి టైమయింది” అంటూ కల్లు సీసా ఖాళీచేసి గడ్డ పలుగు అందుకుని లేచాడు.

కోటిగాడి ముఖంలో సంతోషం మచ్చుకైనా లేకుండా పోయింది, అయ్య పనికి లెమ్మనగానే. మౌనంగా లేచి తట్టలూ, పారా అందుకున్నాడు. ఎల్లిగాడు వాటినెత్తి వాడి నెత్తిమీద కుదేశాడు. అలవాటయిన బరువు కిక్కురు మనకుండా మోస్తున్నాడు కోటిగాడు. వాడి కళ్ళలో మాత్రం అయ్యకు ఏదో చెప్పాలనే ఆత్రత. చివరకు గొంతువిప్పాడు—

“అయ్యా!”

“ఊ—”

కాసేపు మౌనం.

“అయ్యా! మరేమో, మర్నేను ...”

“ఏటి? మర్నేను, మర్నేను ...?”

“మర్నేను ... గాంధిగారి బొమ్మకి రంగులేత్తన్నారయ. సూద్దానికి పోతానే!” కోటిగాడు గారం పోయాడు.

ఎల్లిగాడు ఆగనైనా ఆగలేదు. “ఏడిసినట్టేనన్నావు. పదు!” అన్నాడు మామూలుగానే.

కోటిగాడు మరి మాట్లాడలేదు. *

— ఏ. వి. మంగపతిరావ్